క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



లబ్ధిదారులతో ప్రణవ్, నాయకులు

హుజూరాబాద్: పేదల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంట మండలాలకు చెందిన 86 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. మెరుగైన వైద్యం కోసం కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకొని సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులకు వెంటనే చెక్కులు మంజూరయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. రాజకీయాలతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి అందజేస్తామని తెలిపారు.

ఆర్నకొండ విద్యార్థి ప్రతిభ

చొప్పదండి: మండలంలోని ఆర్నకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల పదో తరగతి చదివిన పూసల సాయికీర్తన తెలంగాణ స్టేట్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ సొసైటీ ప్రవేశ ఫలితాల్లో 1754 ర్యాంకు సాధించి ప్రతిభ కనబరిచినట్లు ప్రధానోపాధ్యాయులు పైడిపల్లి లక్ష్మణ్, గణిత ఉపాధ్యాయుడు కాసుగంటి రాజమౌళి తెలిపారు. పది ఫలితాల్లోనూ 524 మార్కులు సాధించిందని, కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లలో విద్య అందిస్తున్నామని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, విజయ పాల్గొన్నారు.

సన్మానం



సర్టిఫికెట్లతో విద్యార్థులు

హుజూరాబాద్: పట్టణంలోని కరాటే శిబిరంలో విద్యార్థులను సీఐ కరుణాకర్ శుక్రవారం సన్మానించారు. గ్లోబల్ షాటోకాన్ కరాటే డు అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన బెల్ట్ మెరిట్ టెస్టులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కరాటే ద్వారా శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ ఎస్కే జలీల్, నాయకులు చందుపట్ల జనార్దన్, కొండా గణేష్, ఖలీద్ హుస్సేన్, అంబాల ప్రభాకర్, రాజ్ కుమార్, టి.గోపాల్ తదితరులున్నారు.

హోంగార్డుకు...



అభినందిస్తున్న ఎమ్మెల్యే సత్యం

చొప్పదండి: కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వెళ్లిన మండలంలోని కాట్నపల్లి గ్రామానికి చెందిన బండారి శంకరమ్మ అస్వస్థతకు గురై ఇబ్బంది పడగా అక్కడే విధులు నిర్వహిస్తున్న కేసరి స్వరూప ఆమెను జగిత్యాల ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించింది. ఈ నేపథ్యంలో స్వరూపను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అభినందించి ప్రోత్సాహకం అందించారు. వెంట కొండగట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, తదితరులున్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న మాజీ సర్పంచ్ అనిత

శంకరపట్నం: పెండింగ్ బిల్లులు చెల్లించాలని అర్కండ్ల మాజీ సర్పంచ్ అనిత మండల పరిషత్ సూపరింటెండెంట్ రాఘవేందర్‌రెడ్డికి శుక్రవారం వినతి పత్రంఅందించారు. ప్రభుత్వం సర్పంచ్‌లకు టార్గెట్ విధించి పనులు చేయించిందని బిల్లులు మాత్రం చెల్లించలేదన్నారు. పెండింగ్ బిల్లులు ఇప్పించాలని వినతిపత్రంలో కోరారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

చిగురుమామిడి: మండలంలోని చిన్నముల్కనూర్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం డప్పుచప్పుళ్ల మధ్య మహిళలు నెత్తినబోనాలతో శివసత్తుల పూనకాలు, బైండ్ల కళాకారుల ఆటపాటలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు పైడిపెల్లి చంద్రయ్య, ఉపాధ్యక్షుడు చిలువేరు శ్రీనివాస్, నాయకులు వెంకటేశం, సతీష్, రమేశ్, పూదరి వేణుగోపాల్, తిరుపతి, కనుకయ్య, రంగు లక్ష్మయ్య, గట్టురాజు, సత్తయ్య పాటు పలువురు పాల్గొన్నారు.



చిన్నముల్కనూర్‌లో పోచమ్మ బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు, భక్తులు

మాజీ ఎమ్మెల్యేల పూజలు

చిగురుమామిడి శివారులోని పొంబండ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం సీపీఐ, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు చాడ వెంకట్ రెడ్డి, వొడితెల సతీశ్‌కుమార్ వేర్వేరుగా పూజలు చేశారు. పండితులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభారోహణ కార్యక్రమాలు వేదపండితులు నమిలికొండ రమణాచార్యులు, శ్రీ ఉమేశ్‌స్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.వెంట హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ కొత్త వినీతశ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ రాజమౌళి, చిగురుమామిడి సింగిల్‌విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, విగ్రహదాతలు ఆకవరం శివప్రసాద్ హాజరయ్యారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

రామాలయంలో ప్రత్యేక పూజలు..

హుజూరాబాద్: పట్టణంలోని రామాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. శుక్రవారం పూర్ణాహుతి, శాంతి కల్యాణం కార్యక్రమాలు జరిపించారు. ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ధ్వజస్తంభం దాత, ఆలయ చైర్మన్ క్యాసా చక్రధర్ భారతి, ఉత్సవ విగ్రహాల దాత తణుకు వేణుగోపాల్ నీలిమ, హనుమత్ వాహనం దాత కల్లెపు మోహన్ రావువినోద తదితరులున్నారు.



హుజూరాబాద్: ఆలయంలో భక్తుల పూజలు

సిరిసేడులో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

ఇల్లందకుంట: మండలంలోని సిరిసేడు రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా వానాకాలంలో సాగుచేసే వివిధ పంటల యాజమాన్య పద్ధతులు, కొత్తగా విడుదలైన విత్తన రకాల గూర్చి కేవీకే శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి సూచించారు. శుక్రవారం వ్యవసాయశాఖ నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు రైతు అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించడం మంచి కార్యక్రమం అని, అధునాతన వ్యవసాయంపై అవగాహన కల్పించి రైతులను చైతన్యం చేయడం ద్వారా మంచి దిగుబడి సాధిస్తారన్నారు. శాస్త్రవేత్తల సలహాలు, సూచనల మేరకు రసాయనిక ఎరువులు, పురుగుల మందులు తగ్గించి పంట పండించడం రైతులకు ఎంతో లాభదాయకమన్నారు. కార్యక్రమంలో మండల ఏవో సూర్యనారాయణ, హెచ్‌ఓ మంజువాణి, జమ్మికుంట అగ్రికల్చర్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఏఈవో మమత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి

గూడులేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు

ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

శంకరపట్నం: గూడులేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందిస్తున్నామని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని తాడికల్, కేశవపట్నం, ఆముదాలపల్లె గ్రామాల్లో శుక్రవారం ఇందిరమ్మ ఇంటినిర్మాణ పనులను ప్రారంభించి, లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో మాట్లాడారు. ఆరు గ్యారంటీల అమలులో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్లు ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్, రూ.రెండులక్షల రుణమాఫీ అమలు చేశామని, రేషన్‌దుకాణాల ద్వారా సన్నబియ్యం పేదలకు అందిస్తున్నామన్నారు. త్వరలో రేషన్‌కార్డులు, నిరుపేదలకు పింఛన్ అందిస్తామని హామీ ఇచ్చారు. ధరణి పేరిట బీఆర్ఎస్ నాయకులు కబ్జాలకు పాల్పడ్డారని, పేదల భూములను లాక్కున్నారని విమర్శించారు. ఉచిత బస్సు ప్రయాణంపై విమర్శలు చేస్తున్న వారిపై మండిపడ్డారు. కూలీలు, విద్యార్థినులు, కూరగాయల రైతులు, పాడిరైతులను అడిగితే తెలుస్తోందని ఎద్దేవా చేశారు. సమావేశంలో హౌసింగ్ పీడీ గంగాధర్, ఎంపీడీవో కృష్ణప్రసాద్, తహసీల్దార్ సురేఖ, మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, ఎంపీవో ప్రభాకర్, డీఈ వెంకటరమణ, ఏఈ అలీ, ఆలయ చైర్మన్ మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ఇందిరమ్మ కమిటీ సభ్యులు, అధికారులను ఎమ్మెల్యే సన్మానించారు.



తాడికల్‌లో ఇందిరమ్మ ఇంటి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

మొక్కల పెంపకంలో భాగస్వాములవ్వాలి



మాట్లాడుతున్న కమిషనర్ ఎండీ అయాజ్, డీఎంసీ, మహిళా సంఘాలు సభ్యులు

జమ్మికుంట: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉమెన్ ఫర్ ట్రీస్ అమృత్ 2.0లో భాగంగా మహిళలు మొక్కలు పెంపకంలో భాగస్వాములు కావాలని కమిషనర్ ఎండీ అయాజ్, మెప్మా డీఎంసీ శ్రీవాణి అన్నారు. శుక్రవారం పట్టణంలోని నాయిని చెరువు ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మట్లాడుతూ మహిళా సంఘంలోని సభ్యులు వర్షాకాలంలో మొక్కలు నాటి, జియోట్యాగ్ ద్వారా వాటిని పర్యవేక్షించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాయిని చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా ఏర్పాటు చేయనుందని తెలిపారు. కార్యక్రమంలో మెప్మా ఇంచార్జి, టీఎంసీ జ్యోతి, సీఎల్ఆర్పీ మంజుల, ఈఈ శ్రీకాంత్, ఆర్పీలు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అనువైన స్థలాల్లో మొక్కలు నాటాలి

చొప్పదండి: పట్టణంలోని అనువైన స్థలాలలో స్వశక్తి మహిళల ద్వారా మొక్కలు నాటించి, జియో ట్యాగ్ ద్వారా అమృత మిత్ర, ఉమెన్ ఫర్ ట్రీస్ కార్యక్రమంలో భాగంగా వాటి సంరక్షణకు కృషి చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ కీర్తి నాగరాజు తెలిపారు. పట్టణంలోని కుడి చెరువు కట్ట ప్రాంతంలో శుక్రవారం స్వశక్తి సంఘం మహిళలతో కలిసి మొక్కలను నాటేందుకు అనువైన ప్రాంతాలను పరిశీలించారు. కుడి చెరువు ప్రాంతంలో మొక్కలను నాటి రెండేళ్లు వాటిని సంరక్షించే బాధ్యత చేపట్టాలని కోరారు. మొక్కలు సక్రమంగా పెరిగేలా పూర్తి బాధ్యతను మహిళలు తీసుకోవాలని సూచించారు. పట్టణంలో పచ్చదనం పెంపొందించడంతో పాటు మహిళలకు భాగస్వామ్యం కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ డీ. ప్రశాంత్ కుమార్, అంజయ్య, శివాణి, మల్లీశ్వరి, ఆర్పీలు, వార్డు అధికారులు పాల్గొన్నారు.



చొప్పదండి: కుడిచెరువు కట్టను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నాగరాజు

నూతన కార్యవర్గం



కేశబోయిన ఓదెలు

హుజూరాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని బోర్నపల్లి గ్రామ గొర్రెల పెంపకందారుల సహకార సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం సభ్యులు ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కేశబోయిన ఓదెలు, ప్రధాన కార్యదర్శిగా అశోక్ యాదవ్, ఉపాధ్యక్షుడిగా లింగయ్య ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా నాని రమేష్, మేడుదుల రాజు, కేశబోయిన కేతమ్మ, గుంపుల రాజమ్మ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడిగా రవీందర్

సైదాపూర్: పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడిగా పైడిపల్లి రవీందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమితి అధ్యక్షుడిగా కొనసాగుతున్న రవీందర్‌గౌడ్ శుక్రవారం పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడిగా కూడా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడుగా కోడం సురేష్, సభ్యులుగా కమ్మం రమేష్, పోలోజు నర్సింహాచారి, వేముల కిశోర్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా అమరేందర్, కిశోర్ వ్యవహరించారు. రవీందర్ ఎన్నిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

రాజీవ్ యువ వికాసం ఇంటర్వ్యూకు భారీగా హాజరు



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న ఎంపీడీవో మధుసూదన్

చిగురుమామిడి: మండల పరిషత్, రైతువేదికల్లో శుక్రవారం రాజీవ్ యువవికాస పథకం దరఖాస్తుదారులకు నిర్వహించిన ఇంటర్వ్యూకూ యువతీ యువకులు భారీగా హాజరయ్యారు. చిగురుమామిడి, రేకొండ, బొమ్మనపల్లి, నవాబుపేట్, ఇందుర్తి, సుందరగిరి గ్రామాలకు చెందిన నిరుద్యోగులు హాజరయ్యారు. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు అధికారులు ధృవీకరణ పత్రాలను పరిశీలించారు. ముఖ్యంగా యాభైవేల నుంచి లక్ష రూపాయల వరకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మొదటి ప్రాధాన్యత కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇంటర్వ్యూలను ఎంపీడీవో మధుసూదన్, ఎంపీఓ రాజశేఖర్‌రెడ్డి, సూపరింటెండెంట్ ఖాజామొయినొద్దీన్ చేపట్టగా పంచాయతీ కార్యదర్శులు, ఇతర శాఖల సిబ్బంది సహకరించారు. మండలంలోని గాగిరెడ్డిపల్లి, గునుకులపల్లి, కొండాపూర్, లంబాడిపల్లి, ముదిమాణిక్యం, చిన్నముల్కనూర్, ఓగులాపూర్, పీచుపల్లి, రామంచ, సీతారాంపూర్, ఉల్లంపల్లి గ్రామాలకు చెందిన దరఖాస్తుదారులు శనివారం ఉదయం పది గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో శనివారం ఇంటర్వ్యూకు హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

మోడల్ హౌస్ పరిశీలన

చిగురుమామిడి: మండలంలోని 17 గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు సకాలంలో నిర్మించుకొని ప్రభుత్వం నుంచి లబ్ధిపొందాలని మాజీ జెడ్పీటీసీ గీకురు రవీందర్ కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను పరిశీలించారు. ప్రభుత్వం సూచించిన ప్రకారం ఇల్లు నిర్మిస్తే లబ్ధిదారులపై ఎలాంటి ఆర్థిక భారం పడదన్నారు. మండల వ్యాప్తంగా మొదటి విడత మంజూరైన 320 ఇళ్లు పూర్తయితే రెండో విడత ఇళ్లు మంజూరయ్యే అవకాశం ఉందన్నారు.



ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను పరిశీలిస్తున్న మాజీ జెడ్పీటీసీ గీకురు రవీందర్

క్రైం వార్తలు

సూపరింటెండెంట్, ఆర్ఎంవోపై వేటు

హుజూరాబాద్: పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న సూపరింటెండెంట్ రాజేందర్‌రెడ్డి, ఆర్ఎంవో సుధాకర్‌రావును వైద్య విధాన పరిషత్ అధికారులు శుక్రవారం సస్పెండ్ చేశారు. వీరి స్థానంలో సూపరింటెండెంట్‌గా నల్ల నారాయణరెడ్డి, ఆర్ఎంవోగా రమేష్‌బాబును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రాజేందర్‌రెడ్డి ప్రైవేట్ ఆసుపత్రి నిర్వాహకులతో ములాఖత్, విధి నిర్వహణ సరిగ్గా చేయడంలేదని, ఆర్ఎంవో సుధాకర్‌రావు కింది స్థాయి సిబ్బందిని పట్టించుకోవడంలేదని, కేసులను ప్రైవేట్ ఆసుపత్రులకు రెఫర్ చేశారన్న ఆరోపణల నేపథ్యంలో ఇద్దరిపై వేటు పడింది.

హత్యాయత్నం కేసులో ఇద్దరికి రిమాండ్

ఇల్లందకుంట: హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితులను శుక్రవారం అరెస్ట్ చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఇంటిస్థలం హద్దుల విషయంలో మండల పరిధిలోని గడ్డివానిపల్లికి చెందిన అన్నదమ్ముల మధ్య ఈ నెల 22న గొడవ జరిగింది. అన్న భార్య ఎలవేని అనూషపై మరిది అజయ్(జైపాల్)తో పాటు తన మామ గడ్డి కొమురయ్య గొడ్డలితో దాడి చేయగా తీవ్రంగా గాయపడింది. అనూష భర్త హరీశ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని, నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ట్రైనీ ఎస్సై దీపక్ కుమార్ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ల కాపర్‌వైర్ చోరీ



చిగురుమామిడి: మండలంలోని సీతారాంపూర్‌లో రైతులు ముస్కుల రాజిరెడ్డి, హనుమాండ్ల శివ వ్యవసాయ బావుల వద్ద అమర్చిన రెండు ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్‌వైర్‌ను గుర్తు తెలియని దొంగలు చోరీ చేశారు. సోమవారం అర్ధరాత్రి దొంగతనం జరిగిందని చిగురుమామిడి ఏఈకి రైతులు ఫిర్యాదు చేశారు. మంగళవారం ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. వానాకాలం సీజన్ ప్రారంభ సమయంలో ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్‌వైర్ చోరీకి గురికావడంతో నారుమడులు సిద్ధం చేసుకోలేమని, ట్రాన్స్‌కో అధికారులు తక్షణం రెండు ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చాలని రైతులు కోరారు.

ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి



మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

హుజూరాబాద్: ఆపరేషన్ కగార్‌లో భాగంగా జరుగుతున్న ఎన్‌కౌంటర్లపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని హైస్కూల్ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమాయక ఆదివాసీలను ఎన్‌కౌంటర్‌లో కాల్చివేస్తున్నారన్నారు. ఒకవైపు మావోయిస్టు పార్టీ కాల్పులను విరమించి శాంతి చర్చలకు సిద్ధమని అనేక పర్యాయాలు లేఖలు, వీడియోల ద్వారా విజ్ఞప్తి చేస్తున్న కేంద్ర ప్రభుత్వం విజ్ఞప్తిని మేధావుల శాంతిచర్చ కమిటీ ప్రతిపాదనలను విస్మరిస్తూ కగార్ పేరుతో హత్యాకాండ కొనసాగిస్తుందన్నారు. సమావేశంలో నాయకులు ముక్కెర రాజు, వేల్పుల రత్నం, తునికి సమ్మయ్య, పసుల స్వామి,సందెల వెంకన్న, వేల్పుల ప్రభాకర్, కొల్లూరి బుచ్చయ్య, సంజీవ్, ఎనగందుల కిష్టయ్య, కుమారస్వామి, గొల్లూరి ప్రవీణ్ కుమార్, ఎండీ మహమ్మద్ తదితరులున్నారు.

రోడ్లపై ధాన్యం ఆరబెడితే చర్యలు

వీణవంక: రోడ్లపై ధాన్యం ఆరబోయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, ఎవరైనా ఆరబోస్తే చర్యలు తప్పవని ట్రైనీ ఎస్ఐ సాయికృష్ణ అన్నారు. మండలంలోని నర్సింగాపూర్ -వల్భాపూర్ గ్రామాల మధ్య రోడ్డుపై ఉన్న మొక్కజొన్న బెండ్ల కుప్పలను తొలగింపజేయించారు. అనంతరం మాట్లాడుతూ ధాన్యం కుప్పలు పోయడం వల్ల వాహనదారులు ప్రమాదలకు గురువుతున్నారని, ఇప్పటికే రైతులకు నోటీసులు ఇచ్చామన్నారు. గ్రామాలలో అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని సాయికృష్ణ హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఎరువుల దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. జమ్మికుంటరూరల్ సీఐ కిషోర్ సూచనల మేరకు డీలర్లకు అవగాహన కల్పించామని, నకిలీ విత్తనాల అమ్మకానికి పాల్పడకూడదని, గుర్తు తెలియని వ్యక్తులకు పురుగుమందులు విక్రయించొద్దన్నారు. పురుగుమందు అమ్మేటప్పుడు రైతు ఆధార్, పాస్‌బుక్ జిరాక్స్, ఫోన్ నంబర్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని, లాట్, పీసీ నంబర్ సరిగా ఉండాలని, సరైన లైసెన్సు ఉన్నవారే అమ్మకాలు నిర్వహించాలని నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

‘మంత్రి మాటలు హాస్యాస్పదం’

కరీంనగర్‌టౌన్: కల్వకుంట్ల కవిత లెటర్ రాస్తే.. బీజేపీ, బీఆర్ఎస్‌లు కలుస్తున్నాయంటూ మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమని బీజేపీ నేత, మాజీ మేయర్ సునీల్‌రావు అన్నారు. శుక్రవారం కశ్మీర్‌గడ్డలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ కుటుంబ పార్టీ అని, ఆ పార్టీతో బీజేపీ పొత్తు ఆలోచనే ఉండదన్నారు. గతంలో బీఆర్ఎస్‌తో కాంగ్రెస్ పొత్తు పెట్టుకొని పోటీ చేసిన విషయాన్ని మరిచి మాట్లాడడం సరికాదని అన్నారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో కాంగ్రెస్ లోపాయికారి ఒప్పందం చేసుకొని అభ్యర్థిని పోటీలో పెట్టలేదన్నారు. కల్వకుంట్ల కవితనే బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయంగా బీజేపీ ఎదుగుతుందని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన హిందూ ఏక్తాయాత్ర వర్షాన్ని లెక్క చేయకుండా విజయవంతం కావడంతో కరీంనగర్‌లో హిందువుల బలమేమిటనేది స్పష్టంగా కనిపించిందన్నారు. నాయకులు దుర్శేటి అనూప్, వంగల పవన్, కొలగాని శ్రీనివాస్, చంద్రమౌళి, గాజ రమేష్, మొండయ్య, లెక్కల రమేశ్, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మేయర్ సునీల్‌రావు

కరపత్రాల ఆవిష్కరణ

కరీంనగర్: ఎంసీపీఐ రాష్ట్ర మొదటి మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సంద గణేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఓరుగల్లు గడ్డపై మహాసభలు ఈనెల 26, 27, 28వ తేదీల్లో జరపాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించిందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం సబ్బండ వర్గాల ప్రజలు పోరాడి సాధించుకున్న రాష్ట్రాన్ని పదేళ్లు ఏలినా బీఆర్ఎస్ రాచరిక పాలనను ప్రజలు జీర్ణించుకోలేకపోయారని, సంక్షేమ పథకాల ఆశ చూపి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలు అమలు చేయడంలేదన్నారు. మహాసభల విజయవంతానికి ప్రజలు విరాళాలు ఇవ్వాలన్నారు.

ప్రమాదకరంగా బావి

కరీంనగర్ రూరల్: కరీంనగర్ మండలం మొగ్దుంపూర్ నుంచి నగునూరు రహదారిలో వ్యవసాయ బావులు ప్రమాదకరంగా ఉన్నాయి. మొగ్దుంపూర్ శివారులోని వ్యవసాయ బావి రోడ్డు పక్కనే ఉండడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కొందరు రైతులు పొలాల్లోని పశుగ్రాసాన్ని దగ్ధం చేయడంతో బావి చుట్టూ ఉన్న ముళ్ల పొదలు, చెట్లు మంటల్లో కాలిపోవడంతో బావి ఏర్పడుతుంది. రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న బావి రక్షణ గోడను నిర్మించాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి రక్షణ గోడను నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డు పక్కన చెట్ల పొదల్లో బావి

ఈ పాస్ యంత్రాల పంపిణీ

కరీంనగర్‌రూరల్: కరీంనగర్‌రూరల్ మండల పరిధినిలో ఎరువుల డీలర్లకు శుక్రవారం కొత్త ఈపాస్ యంత్రాలను డీఏవో భాగ్యలక్ష్మి, ఏవో సత్యం పంపిణీ చేశారు. జూలై 1 నుంచి కొత్త ఈ పాస్ యంత్రాల ద్వారానే డీలర్లు ఎరువులను రైతులకు విక్రయించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం క్రిభ్‌కో కంపెనీ ద్వారా ఈ పాస్ యంత్రాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఏవో స్వప్న, క్రిభ్‌కో కంపెనీ ప్రతినిధులు, ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.



ఈ పాస్ యంత్రం అందిస్తున్న వ్యవసాయాధికారులు